క్లుప్తంగా

బీజేపీతోనే దేశం సుభిక్షం

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



మాట్లాడుతున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

పటాన్‌చెరు టౌన్: దేశం సుభిక్షంగా ఉండాలంటే బీజేపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఉగ్రవాదులతో కాంగ్రెసోళ్లు చేతులు కలుపుతున్నారని అన్నారు. పాకిస్తాన్ సైతం కేంద్రంలో బీజేపీ కాకుండా కాంగ్రెస్ రావాలని కోరుకుంటుందని తెలిపారు. ముస్లిం మహిళలకు రక్షణ కల్పించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. రఘునందన్ ఎంపీగా గెలిస్తే కోట్ల నిధులు తెచ్చి మెదక్ ను అభివృద్ధి చేస్తారన్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నాగసాని నరేష్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించి 65 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ మంజీరానగర్‌కు చెందిన వెంకన్న, పటేల్‌గూడ సృజన లక్ష్మీనగర్‌కు చెందిన వీరేంద్రబాబు ఇరువురు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని శుక్రవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 65 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వెంకన్న వీరేంద్రబాబుపై కేసు నమోదు చేశారు.

బెల్ట్‌షాపుపై దాడి

జహీరాబాద్ టౌన్: టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారులు శుక్రవారం అల్లీపూర్ గ్రామంలోని బెల్ట్‌షాపుపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మి బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో దాడులు చేసి ఆమె వద్ద ఉన్న 32 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పాచిబండ్ల ఊరేగింపు

నారాయణఖేడ్: మండల పరిధిలోని ర్యాకల్‌లో ఈ నెల 7న ప్రారంభమైన ఎల్లమ్మతల్లి ఉత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాచిబండ్ల ప్రదక్షణను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల వస్త్రాలు, పూలతో అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాంచందర్ భీంవంశీకి బసవ పురస్కారం

జహీరాబాద్ టౌన్: సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న కవి, గాయకులు రాంచందర్ భీంవంశీ ప్రతిష్టాత్మకమైన బసవ పురస్కారం అవార్డు అందుకున్నారు. అంబేడ్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులైన రాంచందర్ భీంవంశీ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ సాహిత్య కళలు, సామాజిక ఉద్యమాలను ప్రవృత్తిగా పోరాటాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తించి రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, పీఠాధిపతులు, బసవదళ్ సభ్యులు శుక్రవారం పట్టణంలోని దత్తగిరి బసవ మండపంలో పురస్కారం అందజేశారు. అనంతరం రాంచందర్ భీంవంశీ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవికాంత్, నాయకులు బిచ్చయ్య, విఠల్, నర్సింహులు, పాండు, నర్సింహులు, రాకేష్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగానికి రక్షణ

నారాయణఖేడ్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. ఖేడ్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇండియా కూటమి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కార్పొరేట్ శక్తులతో జతకట్టి, పేద బడుగు, బలహీనవర్గాల వారిని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, సమైక్య వ్యవస్థలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, దత్తు, విజయ్, అనిగేదాస్, చంద్రశేఖర్, మేతరి భాస్కర్, శ్రీకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఘనంగా బసవేశ్వరుడి జయంతి

పటాన్‌చెరు: సమాజంలో అంటరానితనం, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని, ఆయన బోధనలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిని అందించాలన్న లక్ష్యంతో మాజీ సీఎం కేసీఆర్ ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అనంతరం బీరంగూడ చౌరస్తాలోని బసవేశ్వరుడు విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పొగాకు బసవేశ్వర్, పరమేష్‌యాదవ్, అఫ్జల్, జగదీశ్వర్, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణంలో...

జహీరాబాద్ టౌన్: విశ్వగురువు బసవేశ్వరుడి జయంతిని జహీరాబాద్ ప్రాంతంలో శుక్రవారం వీరశైవ లింగాయత్ సమాజ్, రాష్ట్రీయ బసవదళ్ సంఘాల ఆధ్వర్యంలో వేరువేరుగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడికి పూజలు నిర్వహించారు. అనంతరం భారీ శోభాయాత్ర నిర్వహించారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే మాణిక్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, లింగాయత్ సమాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, సుభాష్, పస్తాపూర్ సమాజ్ నాయకులు మల్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలి

నారాయణఖేడ్: ప్రతిఒక్కరూ బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మనూరు మండలంలోని దోసపల్లి గ్రామంలో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలు ఒక్కటేనని, అందరూ ఐక్యంగా శాంతియుతంగా ఉండాలని చాటిచెప్పిన విశ్వగురువు బసవేశ్వరుడు అని కొనియాడారు. బెల్లాపూర్ మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, ఎంపీటీసీ సిద్దారెడ్డి, నాయకులు సంగారెడ్డి, దత్తు, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమృత్, రాజు, శివరావు పాల్గొన్నారు. మహాలింగస్వామి, ఖేడ్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ శంకరప్పపటేల్, నాగశెట్టి, జగదీష్ పాల్గొన్నారు.



బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

బసవేశ్వరుడి విగ్రహం ఆవిష్కరణ

మునిపల్లి(అందోల్): విశ్వగురు, బసవేశ్వర జయంతి సందర్భంగా మునిపల్లిలో బసవేశ్వరుడి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. మల్లన్నగట్టు బసవలింగ అవదూత మహారాజ్ భక్తులకు ఉపదేశించారు. బిచ్కుంద సంస్థాన్ మఠం పీఠాధిపతి సద్గురు సోమలింగ శివాచార్యమహాస్వామి, రంజోల్ రాజయోగి పీఠం డాక్టర్ మఠం రాచయ్యస్వామి తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వీరశైవ లింగాయత్‌లు, భక్తులు పాల్గొన్నారు.

రాయికోడ్ మండల కేంద్రంలో...

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌తో పాటు ధర్మాపూర్, పీపడ్‌పల్లి, మహమ్మదాపూర్, నల్లంపల్లి, కర్చల్ తదితర గ్రామాల్లో బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బసవేశ్వర విగ్రహాలకు అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బసవ జయంతిని ఘనంగా నిర్వహించారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల్లో బసవేశ్వరుడి విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం వివిధ గ్రామాల్లో లింగాయత్ సమాజ్ నాయకులు శోభాయాత్రలు నిర్వహించారు.

బసవేశ్వర జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సదాశివపేట: బసవేశ్వర జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ఎడ్లబజార్, చౌకిమఠం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతిని సదాశివపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బసవ చౌక్ వద్ద ఉన్న బసవేశ్వరుడి విగ్రహానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎడ్ల బజార్, చౌకిమఠం వీరశైవ సమాజం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు వీరశైవులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

భక్తిశ్రద్ధలతో బసవ జయంతి

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో బసవ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడి విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని విద్యుత్ కేంద్ర కార్యాలయ ఆవరణలో బసవేశ్వరుని జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్శాఖ అధికారులు, లింగాయత్ సమాజ నాయకులు పాల్గొన్నారు.

మునిపల్లి మండల పరిధిలో..

మునిపల్లి(అందోల్): బసవ జయంతి సందర్భంగా మండలంలోని పెద్దలోడి బసవేశ్వర దేవాలయంలో వీరశైవ లింగాయత్ జిల్లా నాయకులు బస్వరాజ్ పటేల్ రెండు నంది విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జెండావిష్కరణ చేశారు. పెద్దలోడి, పిల్లోడి, మునిపల్లి, చిన్నచల్మెడ, కంకోల్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు బసవేశ్వర జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయ్‌కుమార్, సతీష్‌కుమార్, మాలిపటేల్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్: దోసపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించండి

మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ శుక్రవారం హత్నూర మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల మోడీ పాలనలో దేశం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. కులం, మతంపేరుతో చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. నిరుద్యోగులను మోసం చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సువాసినిరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచులు వీరస్వామిగౌడ్, కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పెంటేష్, పెంటయ్య, అల్తాఫ్, నరేందర్, బుచ్చిరెడ్డి, రాజు, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా కౌన్సిలర్ చంద్రారెడ్డి, నాయకులు వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని వివరించారు. అదేవిధంగా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు, గుమ్మడిదల పారిశ్రామిక వాడల్లో సీఐటీయూ నాయకులు నీలం మధుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

నీలం మధు గెలుపునకు కృషి చేయాలి

సంగారెడ్డి టౌన్: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సంగారెడ్డి ఎంపీపీ లావణ్య అన్నారు. నీలం మధుకు మద్దతుగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి

కంది(సంగారెడ్డి): కేంద్రంలో బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతో పాటు మతోన్మాదుల చెర నుంచి దేశాన్ని విముక్తి చేసుకోగలమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సిములు అన్నారు. ఇండియా కూటమి పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని చెర్లగూడెం, ఎర్దనూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, మాణిక్యం, చంద్రమౌళి, బుచ్చిరెడ్డి, మానెయ్య, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శేఖర్, శంకరయ్య, నాగేష్, మల్లయ్య, నవీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి మండల పరిధిలో...

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి, పిల్లోడి, పెద్దలోడి, గోపులారం, హైద్లాపూర్, పొల్కంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను గెలిపించాలని కోరుతూ మాజీ ఎంపీపీ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పెంటయ్య, పాండు, సుధాకర్‌రెడ్డి, విజయ్ కుమార్, అంజిరెడ్డి, మాలిపటేల్, వెంకట లక్ష్మారెడ్డి, నరేందర్‌గౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

ఉపాధిపనుల వద్ద ప్రచారం

జహీరాబాద్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌ను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చిరాగ్‌పల్లి, సత్వార్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధికూలీల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌లు, స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో సరియైన ప్రతినిధిని ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మనుగడను కొనసాగుతుందన్నారు. భారతదేశం అన్ని దేశాలకు ఆదర్శమని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, శివదీప్తి, అధ్యాపకులు షరీఫ్‌మియా, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని బొంబాయి కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన సాయిధనుష్‌రెడ్డి మదీనాగూడలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అయితే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో మళ్లీ పరీక్షలు రాసేందుకు కళాశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నాడు. ఎప్పటిలాగానే గురువారం ఉదయం కళాశాలకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో ఉదయం 11గంటల సమయంలో కళాశాల నుంచి సిబ్బంది ఫోన్ చేసి సాయిధనుష్ తరగతులకు హాజరు కాలేదని సమాచారం ఇచ్చారు. దీంతో రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో అతడి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సాయిధనుష్‌రెడ్డి

బీజేపీ శ్రేణుల ప్రచారం



బొల్లారంలో ప్రచారం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగాఆనంద్‌కృష్ణారెడ్డి, మేఘన, రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారాన్ని చేపట్టారు. జిన్నారంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి,రాజిరెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు.

రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్‌లో బీజేపీ జిల్లా నాయకుడు సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రసాద్‌గౌడ్, నరేందర్, గణేష్, రాంచందర్, బాలయ్య పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండల పరిధిలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు ఓటు వేయాలని కోరుతూ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. న్యాల్‌కల్‌లో పలువురు నాయకులు బీజేపీలో చేరారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

జహీరాబాద్: మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జగన్మోహన్ ఆధ్వర్యంలో మాజీ వార్డుసభ్యులు డేవిడ్, రియాజ్, మతిన్, బాల్‌రాజ్, కన్నయ్య, సునీల్ తదితరులు రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు రాములు, అక్బర్ హుసేన్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే ప్రజల సంక్షేమం**

నారాయణఖేడ్: మండల పరిధిలోని చల్లగిద్ద తండా, కల్హేర్ మండలం కొత్తకుంట తండాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఖేడ్ పట్టణంలోని పలువార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్ అలీ, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్ నుంచి టీటీడీపీలో చేరిక**

జహీరాబాద్: జహీరాబాద్‌కు బీఆర్‌ఎస్ నాయకుడు మాచిరెడ్డిపల్లి వెంకట్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి టీటీడీపీలో చేరారు. శుక్రవారం కామారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ టీటీడీపీ ఇన్‌చార్జి పైడి గోపాల్‌రెడ్డి వెంకట్‌రెడ్డికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వెంకట్‌రెడ్డికి పదవి ఇచ్చారు. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న వెంకట్‌రెడ్డి ఏడాది క్రితం బీఆర్‌ఎస్‌లో చేరారు. తిరిగి సొంత పార్టీలో చేరారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిన అజీజ్**

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగంలో బీఆర్‌ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు అజీజ్ కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, వీరొట్టి పాటిల్, గుండప్ప, హఫీజ్, మహేందర్, అంజద్, సాబెర్, శేఖర్, సందీప్, సాయి పాల్గొన్నారు.

◆ **మరమ్మతులు పూర్తి చేయాలి**

పుల్‌కల్(అందోల్): పాఠశాలలు ప్రారంభం నాటికి ఆయా పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఎంఈఓ అంజయ్య అన్నారు. వివిధ పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పంచాయతీరాజ్ ఏఈ శశికుమార్‌తో కలిసి పరిశీలించారు.

◆ **బీజేపీలో చేరిక**

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని హరిచంద్‌నాయక్ తండాకు చెందిన యువకులు ఆ పార్టీ మండల ఇన్‌చార్జి విజయ్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. నాయకులు ఢిల్లీ వసంత్, జగన్నాథ్, సుభాష్, వీరారెడ్డి, పురుషోత్తం, ప్రసాద్, జగన్మోహన్‌రెడ్డి, జాను, రవి, మధు, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

◆ **బైక్ ఢీకొని వృద్ధుడి మృతి**

జహీరాబాద్: బైక్ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని సత్వార్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. సత్వార్ నుంచి మాడ్గి గ్రామానికి టీవీఎస్‌పై 65వ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న హన్మంత్‌రావు(65)ను వెనుక నుంచి రాజ్‌కుమార్ మోటారు సైకిల్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హన్మంత్‌రావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజ్‌కుమార్ స్వల్ప గాయాలు అయ్యాయి. మృతుడు పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలంలోని వడ్లమూడివారి పల్లె గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. సత్వార్‌లో నివాసం ఉంటూ చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మృతుడి భార్య రోషమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ **నీలం మధును గెలిపించాలి**

సంగారెడ్డి: బీసీ బిడ్డ నీలం మధును మెదక్ ఎంపీగా గెలిపించేందుకు బీసీ సంక్షేమ సంఘం పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటు మాదే సీటు మాదే అనే నినాదంతో సంఘటితంగా పార్టీలకతీతంగా బీసీలు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు మల్లన్న, తాటిపల్లి పాండు, గోకుల్ కృష్ణ, జగదీష్, మహేష్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మద్యం విక్రయాలు బంద్

ప్రభుత్వ ఆదేశాలు జారీ



మద్యం షాపులో స్టాక్ చెక్ చేస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించారు. మూడు రోజుల పాటు మద్యం విక్రయాలు నిలిపివేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల పాటు డ్రైడే ఉంటుందని ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ వివరించారు.

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో..

34 వైన్స్‌లు.. 22 బార్లు

పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో 34 వైన్స్‌లు, 22 బార్లు ఉన్నాయి. మద్యం విక్రయ కేంద్రాలకు నెలవారీగా వచ్చే మద్యం ఆధారంగా ఆయా దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలిస్తూ, విక్రయాలకు అనుగుణంగా స్టాక్ ఉందా లేదా అని ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

37 బెల్ట్‌షాపులపై కేసులు

ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే అప్పటినుంచి పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 37 బెల్ట్ షాపులపై కేసు నమోదు చేసి, రూ.4 లక్షల విలువ చేసే మద్యంను సీజ్ చేశారు. పర్మిట్ గదిలో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ముందు తాగేవారిని గుర్తించి 18 కేసులు నమోదు చేశారు.

మూడు రోజులు డ్రైడే

ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం మూడు రోజుల పాటు డ్రైడేగా ప్రకటించింది. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసినట్లు అధికారికంగా ప్రకటించే వరకు మద్యం విక్రయాలు ఉండవు. 11వ తేదీ సాయంత్రం అన్ని మద్యం దుకాణాలు మూసివేసి సీల్ వేస్తారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన రాగానే సీల్‌ను తొలగిస్తారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో ఈ మూడు రోజులు మద్యం విక్రయాలకు అనుమతిలేదు. అయితే ఆహార విక్రయాలకు అనుమతి ఉంది.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



మద్యం రవాణా, బ్లాక్‌లో విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎక్కడైనా మద్యం స్టోర్ చేసినా, రవాణా చేసినా ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చేవారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. మద్యం షాపులకు వేసిన సీల్‌ను పోలింగ్ ముగిసినట్లు అధికారికంగా ప్రకటన రాగానే తొలగిస్తాం.

– ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్, పటాన్‌చెరు

అభివృద్ధిని చూసి ఓటేయండి



రామచంద్రాపురం డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణ పరిధిలోని అన్ని కాలనీలలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు నగేష్, కుమార్‌గౌడ్, కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, తిరుమల్, చంద్రశేఖర్‌గుప్తా, పరమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ, భానూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పటాన్‌చెరు ఎంపీపీ సుష్మాశ్రీ,, జెడ్పీటీసీ సుప్రజారెడ్డి, గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, బొల్లారం మున్సిపల్ చైర్మన్ రోజారాణి, వైస్‌ఎంపీపీ స్వప్న, భారతీనగర్ కార్పొరేటర్ సింధు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, మాజీ ఎంపీపీ గాయత్రి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండల పరిధిలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్, న్యామతాబాద్, గంగ్వార్, ముంగి గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్ ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

నారాయణఖేడ్: కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్ మండలంలోని నమ్లిమేట్, డీఎస్‌టీ తండా, సంజీవన్‌రావుపేట్ తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేష్, రైబస మాజీ మండల అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నవాబ్ తదితరులు పాల్గొన్నారు.